సాక్షి జోగులాంబ గద్వాల

బుధవారం । 14 । జూన్ । 2023



వైభవంగా పెద్ద కిస్తీ

అలంపూర్‌లోని పాలెం ఉర్సులో పెద్ద కిస్తీ వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



అతివల ఆరోగ్యమే లక్ష్యంగా..

మహిళల్లో వివిధ రుగ్మతలను గుర్తించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 39.8 /24.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగింపు


గద్వాల అర్బన్: జిల్లాలోని పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పొడగించినట్లు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–25 వరకు ఎలక్ట్రిషియన్, ఫీట్టర్, డాట్స్‌మన్ సివిల్, ఎలక్ట్రికల్, మెకానిక్ కోర్సులు, 2023–24 విద్యాసంవత్సరానికి మెకానిక్ డిజిల్, కోప కోర్సులకు ఈ నెల 19వ తేదీలోగా https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీనికి 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని, 8వ తరగతి పాస్ అయిన విద్యార్థులు కొన్ని కోర్సులకు మాత్రమే అర్హులని, మరిన్ని వివరాలకు సెల్ నం.9110523925లో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

గద్వాల క్రైం: ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధృవపత్రాల వెరిఫికేషన్ ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఎస్పీ సృజన ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల, వనపర్తి జిల్లాకు చెందిన 4,967 మంది అభ్యర్థుల విద్యార్హతకు సంబంధించిన వారి వివరాలు పురుషులకు సంబంధించి ఉదయం 9గంటలకు, మహిళా అభ్యర్థులు ఉదయం 8గంటలకు రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న ఇంటిమేషన్ లేటర్ తప్పనిసరిగా చూయించాల్సి ఉందని, సవరణలు లేని అభ్యర్థులు నేరుగా వారి అర్హత పత్రాలను పరిశీలన చేసుకోవచ్చని తెలిపారు. సవరణ కోసం అర్జీ చేసుకున్న వారు ఆన్‌లైన్ అర్జీ తప్పనిసరిగా తీసుకురావాలని, అభ్యర్థుల సమక్షంలోనే సిబ్బంది సవరణలను ఆమోదిస్తారని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఒరిజనల్ అర్హత ధృవపత్రాలు, ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

రైల్వే ప్రయాణికులకు తీపికబురు

- మచిలీపట్నం రైలు మంత్రాలయం వరకు పొడిగింపు



రైలు పొడిగింపుపై సామాజిక మాధ్యమాల్లో విడుదలైన నోటిఫికేషన్ పత్రం..

గద్వాల రూరల్: మచిలీపట్నం నుంచి కర్నూల్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు మంత్రాలయం రోడ్ స్టేషన్ వరకు పొడగించేందుకు దక్షిణమధ్య రైల్వేశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గద్వాల, రాయచూరు వాసులకు ఇది ప్రయోజనకరంగా మారనుంది. ప్రస్తుతం వారంలో మూడు రోజుల పాటు నడుస్తున్న ఈ రైలు మచిలీపట్నం నుంచి రాత్రి 8గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:30గంటలకు కర్నూల్‌కు చేరుకుంటుంది. అయితే ఈరైలును గద్వాల, రాయచూరు మీదుగా మంత్రాలయం రోడ్‌స్టేషన్‌కు పొడగించేందుకు పెద్ద ఎత్తున విజ్ఞప్తులు రైల్వే శాఖకు అందాయి. ఈనేపథ్యంలో విజ్ఞప్తులను పరిశీలించిన దక్షిణమధ్య రైల్వేశాఖ అధికారులు మంత్రాలయం రోడ్ స్టేషన్‌లో రైలు నిలిపేందుకు అవసరమైన ఏర్పాట్లపై వెంటనే నివేదిక ఇవ్వాల్సిందిగా గుంతకల్ డివిజన్ అధికారులను ఆదేశించింది. నివేదిక పరిశీలిన అనంతరం సాధ్యాసాధ్యాలను పరిశీలించి మచిలీపట్నం రైలును రాయచూరు రోడ్ స్టేషన్‌కు పొడగించనున్నట్లు తెలిసింది.

ప్రయాణం సులభతరం

ఇదే జరిగితే మచిలీపట్నం నుంచి రాత్రి 8గంటలకు బయలుదేరిన రైలు ఉదయం 7:30గంటలకు కర్నూల్‌కు, 8:50గంటలకు గద్వాలకు చేరుకుంటుంది. ఇక్కడ ఇంజిన్ మార్చుకునేందుకు(తిప్పుకునేందుకు) 20నిమిషాలు సమయం కేటాయించారు. అనంతరం 9:10గంటలకు గద్వాల నుంచి బయలుదేరి రాయచూరుకు 10:20గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి మంత్రాలయం రోడ్‌స్టేషన్‌కు 10గంటలకు చేరుకుంటుంది. అదే రైలు తిరిగి మధ్యాహ్నం 3:10గంటలకు మంత్రాలయం రోడ్‌స్టేషన్ నుంచి బయలుదేరి రాయచూరుకు 3:55గంటలకు, గద్వాలకు సాయంత్రం 5:40గంటలకు చేరుకుంటుంది. గద్వాల నుంచి తిరిగి కర్నూల్ మీదుగా మచిలీపట్నం చేరుకుంటుంది. ఇక్కడ సమయపాలనలో ఎలాంటి మార్పులు లేవు. ఇలా రైలు పొడగింపు అమలైతే రాయచూరు, సింధనూరు, మాన్వితో ప్రాంతాల్లోని తెలుగు ప్రజలకు డోన్, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం, నర్సరావుపేట, గుంటూరు, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం వరకు తమ తమ స్వస్థలాలకు చేరుకునేందుకు సులభతరమవుతుంది.

రుణ ప్రణాళిక ఖరారు

1.51లక్షల మంది రైతులకు రూ.2,647 కోట్ల పంట రుణ లక్ష్యం



మానవపాడు మండలం చిన్నిపాడు శివారులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

- బ్యాంకు రుణాలపైనే రైతుల ఆశలు
- గత ఏడాది లక్ష్యంలో 50.43శాతం మాత్రమే రుణాలు

గద్వాల వ్యవసాయం: 2023–24 ఆర్థిక సంవత్సర పంట రుణ ప్రణాళిక ఖరారు అయ్యింది. వానాకాలం, యాసంగి సీజన్‌లో వివిధ రకాల పంటలు వేసే రైతులకు రుణాలు అందించేందుకు బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాలను నిర్దేశించారు. వేలాది మంది రైతులు బ్యాంకులు అందించే రుణాలపైనే ఆశలు పెట్టుకున్నారు. బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందించాలని కోరుతున్నారు. గడిచిన ఏడాది (2022–23)లో బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యంలో 50శాతం మాత్రమే పంట రుణాలు అందించారు.

బ్యాంకుల వారీగా రుణ ప్రణాళిక

జోగులాంబ గద్వాల వ్యవసాయ ఆధారిత జిల్లా. ఏటా పత్తి, వరి, కంది, ఆముదం, వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న పంటలను ప్రధానంగా పండిస్తారు. జూరాల, ఆర్డీఎస్, నెట్టెంపాడు ఎత్తిపోథల పథకంతో పాటు ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి, ముచ్చొనిపల్లి రిజర్వాయర్లకు తోడు 107



ఉండవల్లి శివారులో సాగు చేసిన పత్తి పంట

నోటిఫైడ్ చెరువులు, వందకు పైగా కుంటలు ఉన్నాయి. వాణిజ్యపంటలకు తోడు ఉద్యాన పంటలను సైతం సాగు చేస్తారు. ఇదిలాఉండగా, ప్రతి ఏటా ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి లీడ్‌బ్యాంక్ అధికారులు పంట రుణ ప్రణాళిక, దీర్ఘకాలిక వ్యవసాయ రుణ ప్రణాళిక రూపొందిస్తారు. వివిధ రకాల పంటలు వేసేందుకు పంట రుణ ప్రణాళికను, బోర్లు వేయడం, బావుల తవ్వకం, వ్యవసాయ పనిముట్లు, తోటల పెంపకం,సెరికల్చర్ తదితర వాటి కోసం దీర్ఘకాలిక వ్యవసాయ ప్రణాళిక రూపొందిస్తారు. పంట రుణ ప్రణాళికలో భాగంగా గడిచిన వానాకాలం, యాసంగి సీజన్‌లలో ఇచ్చిన రుణాలు, రైతుల సంఖ్య, జిల్లాలో సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని ఈఏడాది పంట రుణ లక్ష్యాన్ని రూపొందించారు. వానాకాలం సీజన్‌లో 90,708 మంది రైతులకు రూ.1586 కోట్లను, యాసంగిలో 60,472 మంది రైతులకు రూ. 1061.78 కోట్లను లక్ష్యంగా ఇచ్చారు. ఇలా వానాకాలం, యాసంగి సీజన్‌లకు వేరువేరుగా బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. మొత్తం రెండు సీజన్‌లకు కలిపి 1,51,180 మంది రైతులకు 2647.78 కోట్లు లక్ష్యంగా ఉంది. కాగా వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పుడిప్పుడే రుణాలు ఇవ్వడం బ్యాంకులు ప్రారంభించాయి. కాగా గడిచిన ఆర్థిక సంవత్సరం(2022–23)లో 1,45,436 మంది రైతులకు రూ.2404 కోట్లు లక్ష్యంగా నిర్దేశించగా, ఇందులో 50.43 శాతం నెరవేరినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు

ఇదిలా ఉంటే వ్యవసాయ పెట్టుబడులు ఏటేటా పెరుగుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడిసాయం అందిస్తున్నా...అది పూర్తి అవసరాలను తీర్చలేదు. తప్పనిసరిగా పంట పెట్టుబడుల కోసం రైతులకు డబ్బు అవసరం అవుతుంది. ఈక్రమంలో వేలాది మంది రైతులు బ్యాంకులు అందించే పంట రుణాలపైనే ఆశలు పెట్టుకుంటారు. ఆ రుణాల ద్వారానే పంటలను సాగు చేస్తారు. ఆయా పంటలకు రుణ పరిమితి మేరకు సకాలంలో రుణాలు అందించాలని కోరుతున్నారు. బ్యాంకర్లు సకాలంలో అందించకపోతే అధిక వడ్డీలకు ప్రైవేట్ అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. గడిచిన వానాకాలం సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక దాదాపు అన్ని పంటల దిగుబడులు తగ్గి ఆర్థికంగా నష్టాలు చవిచూశామని, ఇప్పుడు పంట పెట్టుబడులకు బ్యాంకులు అందించే రుణాలపైనే ఆధారపడ్డామని రైతులు అంటున్నారు.

జిల్లాలో పంట రుణ లక్ష్యం వివరాలు ఇలా..

బ్యాంకు	వానాకాలం సీజన్ రైతుల సంఖ్య	రుణ లక్ష్యం (రూ. కోట్లలో)	యాసంగి సీజన్ రైతుల సంఖ్య	రుణ లక్ష్యం (రూ. కోట్లలో)
ఎస్‌బీఐ	33,739	585.00	22,493	390.37
యూబీఐ	15,668	279.00	10446	186.21
ఏపీజీవీబీ	12,980	239.00	8654	159.72
డీసీసీబీ	6,514	116.00	4342	77.97
ఇండియన్‌బ్యాంక్	5,712	98.00	3742	63.06
కెనెరా	5,410	90.00	3606	60.48
కేబీఎస్	2,957	45.00	1971	30.47
ఐసీఐసీఐ	2,176	39.00	1450	25.36
సెంట్రల్ బ్యాంక్	2,052	36.00	1368	24.47
హెచ్‌డీఎఫ్‌సీ	1,682	28.00	1121	19.13
యాక్సిస్	1,044	19.00	696	11.88
కోటాక్‌మహేంద్ర	373	5.00	249	3.87
ఇండస్ ఇండ్	283	4.00	188	3.21
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	218	3.00	146	2.58

సకాలంలో రుణాలు అందిస్తాం



గడిచిన వానాకాలం, యాసంగి సీజన్‌లలో లక్ష్యంలో 50.43శాతం రుణాలు ఇచ్చాం. ఈ సీజన్‌లో రైతులకు పంట రుణాలను సకాలంలో అందించేలా ఆయా బ్యాంకుల అధికారులకు దిశా నిర్దేశం చేశాం. రైతులు రుణాలను పంటల పెట్టుబడుల కోసం వినియోగించుకొని, సకాలంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలి.

– అయ్యపురెడ్డి, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత, చిత్రంలో కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యే బండ్ల

- జెడ్పీచైర్‌పర్సన్ సరిత
- ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం
- ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



చిన్నారి నృత్య ప్రదర్శన

గద్వాల అర్బన్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని జెడ్పీచైర్ పర్సన్ సరిత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మహిళ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమెతో పాటు కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. మహిళలకు వెన్నంటి ఉంటూ కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ తదితర పథకాలు మరింత ఖ్యాతిని పెంచాయని, మహిళలు దేనిలో తక్కువ కాదని, అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా బాల సదన్ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు జిల్లాలోనే కాక రాష్ట్రస్థాయిలో కూడా ప్రసిద్ధి చెందాలన్నారు. ఆనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ గర్భిణి, పుట్టబోయే బిడ్డ సంక్షేమమే సమాజ ప్రగతికి తొలిమెట్టు అని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో పౌష్టికాహారం లోపం, రక్తహీనత నివారణకు ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మహిళ ఉద్యోగులకు 33శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు.

మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం బాల సదనం చిన్నారుల నృత్యప్రదర్శనాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ముషాయిదా బేగం, డీఆర్‌డీఓ ఉమాదేవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం : వనపర్తి కలెక్టర్

వనపర్తి: మహిళలు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, అన్ని రంగాలలో రాణిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ''తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం'' వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు సైతం ఆశించిన మేరకు విద్య అభ్యసించటంతో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. కుటుంబంలో చిన్న వయస్సు నుంచి బాలికలను, బాలురను సమానంగా పెంచాలని, స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమేనన్నారు. దశాబ్దాల క్రితమే దేశాన్ని ఇందిరాగాంధీ పాలించి మహిళాశక్తి అపూర్వమైందని నిరూపించారన్నారు. ప్రతి పనిలోనూ మహిళలు పురుషులకంటే అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. మహిళలను స్త్రీ మూర్తిగా ఆరాధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఝాన్సీ లక్ష్మీ బాయి, రాణిరుద్రమ, సమ్మక్క సారక్క, సావిత్రీ బాయి పూలే, ఇందిరాగాంధీ వంటి మహిళలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో అవకాశాలను అందిపుచ్చుకొని, విజయాలు సాధిస్తుండడంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

మహిళలు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో చురుకుగా పాల్గొని ఉన్నత స్థాయిలను అదిరోహిస్తున్నారని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నదని, మహిళలు ఎంతో నైపుణ్యంతో అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. అనంతరం ఆయా రంగాల ప్రజలకు మంత్రి, కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, ఆర్డీఓ పద్మావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

గద్వాల: ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షలు జరిగాయి. మొత్తం 1,181 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1,115 మంది విద్యార్థులు హాజరయ్యారు. 66 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1,072 మంది విద్యార్థులకుగాను 1,015 మంది విద్యార్థులు హాజరు కాగా, ఓకేషనల్ విభాగంలో 109 మంది విద్యార్థులకు గాను 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్ష కొనసాగగా.. మొత్తం 321 మంది విద్యార్థులు హాజరయ్యారు. 18 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. గద్వాల పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్యా జిల్లా అధికారి హృదయరాజు తనిఖీ చేశారు.



ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ హృదయరాజు

వేరుశనగ రూ.7070

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు మంగళవారం 255 క్వింటాళ్ల వేరుశనగ రాగ, క్వింటాలకు గరిష్టం రూ.7070, కనిష్టం రూ. 4729, సరాసరి రూ. 6260 లభించాయి. అలాగే, 29 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 5501, కనిష్టం రూ. 4759, సరాసరి రూ. 5445 ధర పలికింది. 66 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2164, కనిష్టం రూ. 1929, సరాసరి రూ. 2163 ధరలు వచ్చాయి.

దయాకర్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

- పిలిస్తే పలికే నేతగా కార్యకర్తల్లో నేటికీ చెదరని ముద్ర
- అంత్యక్రియలకు తరలివచ్చిన అభిమా నులు
- పాడె మోసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- హాజరైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు



దేవరకద్ర/మక్తల్/చిన్నచింతకుంట/అమరచింత: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డికి అభిమానులు, కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఆయన పార్థివ దేహాన్ని స్వగ్రామమైన చిన్నచింతకుంట మండలంలోని పర్కాపూర్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దయాకర్‌రెడ్డి మృతి సమాచారం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వగ్రామానికి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దయాకర్‌రెడ్డి పాడె మోసి ఆప్తమిత్రునికి వీడ్కోలు పలికారు. అలాగే రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వరెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల నుంచి వేలాదిగా అభిమానులు తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు.



అంత్యక్రియలకు హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు..



సీతమ్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రి డీకే అరుణ

రెట్టింపు ఉత్సాహంతో వస్తా..

అనారోగ్యం కారణంగా కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్న దయాకర్‌రెడ్డి గత నెల ఆస్పత్రిలో చేరక ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు కొంత అస్వస్థత కారణంగా గ్యాప్ వచ్చిందని.. తిరిగి పుంజుకుని రెట్టింపు ఉత్సాహంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తాను అని చెప్పారు. తన అనుచరులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని, ఎవరు బెదిరించినా వెనకంజ వేయొద్దని కోరారు. తన ఆరోగ్యం మెరుగయ్యాక దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల్లో పర్యటిస్తామని, మళ్లీ రెండు చోట్ల ఇద్దరం పోటీ చేస్తామని ప్రకటించారు. కానీ, ఆయన చివరగా గంభీరంగా చేసిన ప్రసంగం అదే ఆఖరిది కావడం అభిమానులను కలచివేసింది.



అంత్యక్రియలకు హాజరైన జనం

సాగునీటి కోసం ఆరాటం..

చెంతనే కృష్ణానది ఉన్నా.. సాగునీరు అందక బీళ్లుగా మారిన భూములను చూసి చలించిపోయారు. ఈ క్రమంలో దయాకర్‌రెడ్డి అమరచింత నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొంది.. సాగునీరు అందించే కార్యక్రమాలు చేపట్టి రైతుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అప్పటి సీఎం చంద్రబాబునాయుడును నియోజకవర్గానికి రప్పించి అమరచింత, కురుమూర్తిరాయ, పస్పుల, కొండదొడ్డి ఎత్తిపోతల పథకాలను సాధించారు. అలాగే కోయిల్‌సాగర్, రామన్‌పాడ్ ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. అమరచింత నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పరితపిస్తూ రహదారులు, పాఠశాలలు, షాదీఖానాలు, కమ్యూనిటీ భవనాలు నిర్మించి నియోజకవర్గ అభివృద్ధికి అవిశ్రాంత కృషిచేశారు.

నాలుగు దశాబ్దాలుగా..

కొత్తకోట దయాకర్‌రెడ్డి తన రాజకీయ జీవితం టీడీపీతోనే ప్రారంభించి చివరికి ఆ పార్టీతోనే ముగించారు. ఇటీవల రాజీనామా చేసినట్లు ప్రకటించినా.. కానీ, ఏ పార్టీలోనూ చేరలేదు. పార్టీ మారాలని పలుమార్లు దేవరకద్ర, మక్తల్ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించిన ఆయన తుది నిర్ణయం తీసుకోలేకపోయారు. అయితే ఆపద సమయంలో కార్యకర్తలకు అండగా ఉంటూ పిలిస్తే పలికే నేతగా ఖ్యాతిగడించారు.

తీరని కోరిక..

మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దయాకర్‌రెడ్డి మంత్రి పదవి కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఉమ్మడి జిల్లాలో ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. చివరికి ఆయన మంత్రి కావాలనే కోరిక తీరకుండానే అనంతలోకాలకు వెళ్లిపోయారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



కొత్తకోట రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం పెద్దమందడి మండలం అనకాయిపల్లితండా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. ఆత్మకూర్‌కు చెందిన బోయ ఆంజనేయులు(28), ఆయన భార్య కల్పన వనపర్తి మండలం చిట్యాలకు చెందిన తిరుపతయ్య దగ్గర గేదెలకాపరిగా పని చేస్తున్నారు. రోజులాగే గేదెల పాకను శుభ్రం చేసేందుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి పరిశీలిస్తుండగా తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా కేకలు వేశాడు. గమనించిన భార్య కాపాడమంటూ అరవడంతో చుట్టుపక్కల పొలాల రైతులు వచ్చి సరఫరా నిలిపివేసి చూడగా అప్పటికే మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఆంజనేయులుకు పాప, బాబు ఉన్నారు.

బావిలో పడి యువకుడు..



ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీకాలనీలో ఉన్న మాదరంవారి బావిలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. రాజమూర్ గ్రామానికి చెందిన హరీష్‌కుమార్(25) అత్తగారి గ్రామం ధన్వాడ వచ్చాడు. ఉదయం బయటికి వెళ్లి వస్తాను అని చెప్పి బావమరిదితో కలిసి వెళ్లాడు. అయితే బావి సమీపంలో కుర్చున్న హరీశ్ బహిర్భూమికి వెళ్లి వస్తా అని చెప్పి వెళ్లాడు. బావి పైనుంచి దూకడాన్ని బావి దగ్గర ఉన్న ఓ యువకుడు చుసి బయటికి రా అని చెప్పినా ఎంతకూ రాలేదు. దీంతో బావిలోకి దూకి కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. బావిలో నీరు అధికంగా ఉండటంతో వెతకడం ఇబ్బందిగా మారింది. స్థానిక పోలీసులు, ఫైర్ ఇంజన్‌ల సాయంతో నీటిని తోడే ప్రయత్నం చేస్తున్నారు.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి..

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన గోపాల్(55) ట్రాక్టర్ నడుపుతుండగా ఫిట్స్ రావడంతో కిందపడి చనిపోయాడు. ఎస్ఐ బాలవెంకటరమణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పుట్ట నారాయణ పొలం దున్నడానికి గోపాల్, ట్రాక్టర్ తీసుకొని ఉదయం వెళ్లాడు. పొలం దున్నతుండగా ఫిట్స్ రావడంతో ట్రాక్టర్ కిందపడ్డాడు. తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పొలం యజమాని పుట్ట నారాయణ వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించగా, ప్రథమ చికిత్స చేస్తుండగానే గోపాల్ చనిపోయాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: అనుమానాస్పద స్థితిలో గాయపడి జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎర్రమన్నుగుట్ట తాండకు చెందిన దేవావత్ రఘు(36) జిల్లా జనరల్ ఆస్పత్రిలో దాదాపు ఏడు రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు రఘు ఈనెల 7న రాత్రి 9గంటల ప్రాంతంలో టిఎస్ 06ఈవై 6673అనే ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. రాత్రి 10గంటల ప్రాంతంలో అప్పన్నపల్లి బ్రిడ్జి దగ్గర అనుమానాస్పదంగా పడిపోవడంతో ఆస్పత్రిలో చేర్పినట్లు భార్యకు ఫోన్ వచ్చింది. దీంతో ఆమె ఆస్పత్రికి వెళ్లింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై గోకారి కథనం ప్రకారం.. గట్టు మండల కేంద్రానికి చెందిన వీరేంద్ర (30), భార్య సుజాతతో కలిసి బీచుపల్లి పుణ్యక్షేత్రంలో కొంతకాలంగా భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి బీచుపల్లి స్టేజీలో రోడ్డు దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గద్వాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



దర్గాలో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రార్థనలు



ప్రసాదం విసురుతున్న భక్తులు

వైభవంగా పెద్ద కిస్తీ

- జనంతో కిక్కిరిసిన దర్గా ప్రాంగణం
- ప్రసాదానికి పహిల్వాన్ల పోటా పోటీ
- హాజరైన ప్రముఖులు

అలంపూర్/అలంపూర్ రూరల్: పట్టణంలోని హజ్రత్ షా–అలీ–పహిల్వాన్ ఉర్సులో మూడోరోజు మంగళవారం పెద్ద కిస్తీ వైభవంగా నిర్వహించారు. కిస్తీ పోటీలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కిసోత్ల వేసిన తబురుక్ (ప్రసాదం) కోసం పహిల్వాన్లు పోటీ పడ్డారు. కిస్తీలోని ప్రసాదాన్ని భక్తులపైకి విసురుతూ ఉర్సు ప్రాధాన్యాన్ని చాటి చెప్పారు. ప్రధాన ఘట్టమైన కిస్తీ పోటీలను దర్గా అభివృద్ధి కమిటీ చైర్మన్ సయ్యద్ అహ్మద్‌షా ఒవైసీ ప్రారంభించారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే డా. వీఎం అబ్రహం ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం కిస్తీ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే దర్గాలో చాదర్ సమర్పించారు. సర్కారి కిస్తీ సయ్యద్ ఖాదర్‌బాషా ఇంటి నుంచి భాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా దడ్ ముబారక్ దర్గాకు చేరుకుంది. అక్కడ మతపెద్దలు తెచ్చిన పలావును కిస్తీలో నింపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కిస్తీ పోటీలను ప్రారంభించడంతో పహిల్వాన్లు పోటాపోటీగా ప్రసాదాన్ని దక్కించుకొని భక్తులపైకి విసిరారు. దర్గా ఆవరణలోని పురాతన రాతి కిస్తీ(పడవ ఆకారంలో ఉండే..)లో భక్తులు తెచ్చిన ప్రసాదాన్ని నింపగా పహిల్వాన్లు పోటీపడి దానిని భక్తులకు అందజేశారు. ఉర్సులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



పెద్దకిస్తీలో పాల్గొన్న భక్తులు



సర్కారి కిస్తీ నింపి ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు



ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే డా. అబ్రహం

మతసామరస్యాన్ని కాపాడుకుందాం..

మతసామరస్యాన్ని కాపాడుకుందామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో కొనసాగుతున్న షా–అలీ–పహిల్వాన్ ఉర్సుకు మంగళవారం ఆయన హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 42 ఏళ్ల తర్వాత ఉర్సులో పాల్గొన్నానని సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్కృతిని సజీవంగా కాపాడిన ప్రాంత ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు తదితరులు ఉన్నారు.

పోటాపోటీగా పెద్ద కిస్తీలు..

షా అలీ పహిల్వాన్ దర్గాలో పెద్ద కిస్తీ పోటీల కోసం భక్తులు ఊరేగింపుగా ప్రసాదాన్ని తీసుకొచ్చారు. అక్బర్‌పేట, కట్టెలపేట, న్యూప్లాట్స్‌కాలనీ, సింగవరం, కాశీపురం, ఇమాపురం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రసాదాలను కిస్తీలకు తరలించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రసాదాన్ని ప్రత్యేక అండాల్లో తయారు చేసి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలలో తీసుకొచ్చి కిస్తీ పోటీలను కొనసాగించారు. ఉర్సుకు వచ్చిన భక్తులతో ప్రధాన వీధులు కిక్కిరిశాయి. ఉత్సవాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచేగాక నాగర్‌కర్నూల్, అచ్చంపేట, వనపర్తి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, గద్వాల, కొల్లాపూర్, కర్నూలు, నంద్యాల, డోన్, కోడుమూరు, నందికొట్కూరు, గుల్బార్గ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. ప్రధాన రహదారుల్లో ఏర్పాటుచేసిన మిఠాయి, బొమ్మలు, గాజుల దుకాణాలు భక్తులతో సందడిగా మారాయి.

అతివల ఆరోగ్యమే లక్ష్యంగా..



- నేడు జిల్లాలో ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభం
- 8 రకాల సర్వీస్‌లతో పాటు 57 రకాల పరీక్షలు
- మొదటి దశలో ఏడు పీహెచ్‌సీలలో నిర్వహణ

పాలమూరు: అతివల ఆరోగ్యమే లక్ష్యంగా సర్కార్ దృష్టి పెట్టింది. వివిధ రుగ్మతలను గుర్తించేందుకు ఆరోగ్య మహిళ అనే కార్యక్రమాన్ని జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం చేయనున్నారు. ఇందు కోసం జిల్లాలో ఏడు పీహెచ్‌సీలు ఎంపిక చేశారు. జానంపేట, దేవరకద్ర, పేరూర్, హన్వాడ, మిడ్జిల్, రామయ్యబౌళి, పాత పాలమూరులలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటిలో ఇకపై సాధారణ ఓపీతో పాటు ప్రతి మంగళవారం 18 ఏళ్లు పైబడిన అమ్మాయిలు, మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆరోగ్య మహిళ పేరిట నిర్వహించే ఈ కార్యక్రమం కింద ఎనిమిది రకాల సేవలతో పాటు 57 రకాల పరీక్షలు చేస్తారు. అలాగే మహిళలకు విటమిన్–బీ12, విటమిన్–డీ3 చేయనున్నారు. దీంతో పాటు మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేస్తారు. రొమ్ము, గర్భాశయ, నోటిక్యాన్సర్లకు సంబంధించి స్క్రీనింగ్ చేస్తారు. వీటిలో ఏమైనా లక్షణాలు కన్పిస్తే సదరు మహిళలను జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. థైరాయిడ్, అయోడిన్, రక్తహీనతతో బాధపడే వారిని గుర్తిస్తారు. మూత్రకోశ సమస్యలు, మోనోపాజ్‌కు సంబంధించిన పరీక్షలు చేసి అవసరమైన వారికి సూచనలు చేస్తారు. జిల్లాలో ఆరోగ్య మహిళ సేవలను అందించే ఆయా కేంద్రాలకు చెందిన వైద్యులు, సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

■ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే మహిళలో అధికంగా మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ సమస్యలతో బాధపడుతున్న వారే ఉంటున్నారు. ఆ తర్వాత మామోగ్రామ్, థైరాయిడ్, వీఐఏ సమస్యలతో బాధపడే వారు ఉంటున్నారు. రొమ్ము క్యాన్సర్‌తో పాటు ఇతర ఇన్‌ఫెక్షన్‌లతో బాధపడే వారు ఎక్కువగా ఉంటున్నారు.

ప్రతి పీహెచ్‌సీలో 50 మందికి..

ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద ప్రతి పీహెచ్‌సీలో 50 మందికి ఓపీ చూడాలి. దీంతో క్రమేణా ఓపీ పెరుగుతుంది. ప్రతి మంగళవారం ఇక్కడ మహిళా వైద్యులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. పరీక్షల కోసం వచ్చేవారి నుంచి రక్త నమూనాలు సేకరించి టీ–హబ్ ద్వారా అన్ని రకాల పరీక్షలు చేస్తాం. విటమిన్ డీ–3, బీ–12 పరీక్షలు నిర్వహిస్తాం. దీంతో పాటు గుండె వ్యాధిగ్రస్తులకు 2డీ ఎకో, ఎక్స్‌రే, ఈసీజీ, మామోగ్రామ్ పరీక్షలు చేస్తాం.

– డాక్టర్ శ్వేతా రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్

పదోన్నతులు కల్పించాలి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులను వెంటనే చేపట్టి తాత్కాలిక పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ అనుపటి మల్లికార్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో నిర్వహించిన తపస్ జిల్లా సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని అన్నారు. సరిపడా టీచర్లు లేకుండా బడిబాట కార్యక్రమం చేపట్టినా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు ఎలా వస్తారని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, కార్యదర్శి నర్సింహా, రమేష్, నరేందర్, రవికుమార్, సురేష్, శ్రీనివాస్, లావణ్య, విజయలక్ష్మి, విజిత, రాధిక పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి మంగళవారం 570 క్యూసెకుక్కల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. 8.164 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 134 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 809.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 809.2 అడుగుల నీటిమట్టం, 33.8614 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 563 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయంలో 209 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

తెలంగాణలోనే మొట్టమొదటిగా ‘డిజిటల్ క్రాప్ సర్వే’



వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న టెక్నికల్ బృందం సీనియర్ మేనేజర్ సరిత

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పంటల ఖచ్చితమైన నమోదు కోసం రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సర్వేకు మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం వెంకటాపూర్‌లో శ్రీకారం చుట్టారు. దీంతో దేశంలోని ప్రతి గుంట భూమిలో సాగు చేస్తున్న పంటలు వివరాలు నమోదయ్యే అవకాశం ఉంది. అనువనువునా పంటల వివరాలు సేకరించి నమోదు చేస్తుండడం వల్ల కచ్చితమైన సమాచారం ప్రభుత్వం దగ్గర ఉండే అవకాశం ఉంటుంది. అంతేకాక పంటల ఎగుమతులు, దిగుమతులకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. అంతేకాక పంటల బీమా, పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు కనీస మద్దతు ధర నిర్ణయించడానికి వీలుంటుంది. రైతుబంధు, రైతుబీమా చెల్లింపులకు సులువుగా మారే అవకాశం ఉంది. ప్రయోగాత్మకంగా జిల్లాలో చేపట్టిన ఈ సర్వే గల్లీ నుంచి ఢిల్లీ వరకు కొనసాగుతుందని ఢిల్లీ అధికారుల బృందం తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా డిజిటల్ క్రాప్ సర్వే ట్రయల్ వెంకటాపూర్‌లో చేపట్టడం విశేషం. ఈ సర్వే ద్వారా ప్రతి సర్వే నంబర్‌లో ఖచ్చితమైన పంటల నమోదు చేయడం, ఆ పంటను ఫొటో తీయడం జరుగుతుంది. దీని ద్వారా ప్రతి గ్రామం నుంచి జాతీయ స్థాయి వరకు పంటల నమోదులో ఖచ్చితత్వం పెరుగుతుంది. కార్యక్రమంలో టెక్నికల్ బృందం సీనియర్ మేనేజర్ సరిత, రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ నుంచి డీడీఏలు గోవింద్, శైలజ, జేడీఏ విజయగౌరి, ఏఓలు జాన్, రాజేష్ హాజరవగా.. డీఏఓ వెంకటేష్, ఏఓ ఇష్రత్ సుల్తానా, ఏఈఓలు భవాని, కృష్ణకాంత్, హనీఫ్, నాగార్జున, టీనా తదితరులు పాల్గొన్నారు.

‘పాలమూరు’ ప్రధాన కాల్వ పనులు అడ్డుకున్న నిర్వాసితులు



కొల్లాపూర్ రూరల్: పెద్దకొత్తపల్లి మండలం తిర్నపల్లికి చెందిన అయిదుగురు రైతులు 8 ఎకరాలకు సంబంధించిన పరిహారం చెల్లించడం లేదని గ్రామ సమీపంలో కొనసాగుతున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల కథనం ప్రధాన కాల్వ పనులను మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిహారం చెల్లించకుండా కొన్నేళ్లుగా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే పరిహారం అందడం లేదన్నారు. విషయం తెలుసుకున్న డీఈ మాధవరావు ఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రైతులు ఒప్పుకోకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని డీఈ వద్ద ప్రస్తావించగా.. నష్టపరిహారం అందని మాట వాస్తవమేనన్నారు. ఇందుకు సంబంధించిన దస్త్రం పంపడంలో ఆలస్యమైందని.. ఉన్నతాధికారులకు విన్నవించామని తెలిపారు.

నేటి నుంచి కానిస్టేబుల్, ఎస్ఐ అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం నుంచి ఈ నెల 24 వరకు కానిస్టేబుల్, ఎస్ఐ తుది పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ తెలిపారు. జిల్లా పరేడ్ మైదానంలో సర్టిఫికెట్ల పరిశీలన కోసం నిర్వహిస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 4,896 మంది అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన 24వ తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. పది రోజుల పాటు ఉదయం 6.45 నుంచి రాత్రి 7గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీలో తమ లాగిన్ ఐడీ నుంచి లాగిన్ అయి ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఇంటిమేషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకొని.. అందులో ఇచ్చిన తేదీల ప్రకారం సర్టిఫికెట్స్ తీసుకుని పరిశీలన కోసం ఎస్పీ కార్యాలయానికి రావాలని సూచించారు.

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు



మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ, కంట్రోలర్ తదితరులు

మొదటి రోజు 13 మంది విద్యార్థుల డిబార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు 2వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు పరీక్ష ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు జరగగా.. 2,977 మందికి గాను 2,492 మంది హాజరవగా.. 485 మంది గైర్హాజరయ్యారు. అలాగే సెమిస్టర్– 6 విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఇందులో 10,757 మందికి గాను 9,832 మంది హాజరవగా.. 369 మంది గైర్హాజరయ్యారు. ఇందులో మొదటి రోజే ఏకంగా నారాయణపేట, జడ్చర్ల, కొడంగల్, నాగర్‌కర్నూల్ డిగ్రీ కళాశాలల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న విద్యార్థులను స్క్వాడ్‌తోపాటు ఇన్విజిలేటర్లు బుక్ చేశారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్ మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంతో పాటు పలు డిగ్రీ కళాశాలల్లో పరీక్షలను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా అధికారులు పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని కంట్రోలర్ సూచించారు.

నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేపట్టిన కుటుంబ సభ్యులు



మృత శిశువుతో రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

కల్వకుర్తి టౌన్: నవజాత శిశువు మృతిపై వారి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట రాస్తారోకో నిర్వహించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన హసీనా ఉన్నీసా ప్రసవం కోసం పట్టణంలోని సీహెచ్‌సీకి సోమవారం వచ్చింది. సాధారణ ప్రసవం కోసం వైద్యులు ప్రయత్నించి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో డెలివరీ చేశారు. డెలివరీ అనంతరం బాబు ఉమ్మ నీరు మింగటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో నవజాత శిశువును హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న క్రమంలో ఆస్పత్రికి చేరుకునే లోపే మరణించాడని అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో శిశువు కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంతో కల్వకుర్తి సీహెచ్‌సీకి చేరుకొని ఆస్పత్రి ముందు రాస్తారోకో నిర్వహించారు. వైద్యులు శిశువు జన్మించిన తర్వాత రెండు గంటల పాటు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. సంబంధిత వైద్యులు లేకపోవటంతో, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే శిశువు మరణించాడని ఆరోపించారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక సీఐ పార్థసారథి అక్కడికి చేరుకుని బాధిత కుటుంబభ్యులతో మాట్లాడారు. ఘటనపై విచారణ నిర్వహించి, తగు న్యాయం చేస్తామని చెప్పారు. దీంతో శిశువు కుటుంబసభ్యులు రాస్తారోకో విరమించారు. రాత్రి సమయంలో గంటకు పైగా రాస్తారోకో నిర్వహించటంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసి, వారిని అక్కడ నుంచి పంపించారు.

నీట్‌లో రిషి కళాశాల విద్యార్థుల ప్రభంజనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్–2003లో మహబూబ్‌నగర్‌లోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో రిషి కళాశాలలోని 18 మంది విద్యార్థులు 530పైగా మార్కులు సాధించారు. ఇందులో డబ్ల్యూ.అనుష్క (672 మార్కులు), సి.మౌర్య(653), కె.శివకుమార్ (640), ఎస్‌వీ కృతిక్ తేజ (630), ఎస్.యుగంధర్ యాదవ్ (604), ఎస్.సాత్విక (589), కె.మిథిల(586), టి.శ్రీమిత్ర(569), జె.వేణుగోపాల్ (565), ఎస్.కార్తీక్ (564), జె.చిన్మయి (562), బి.విశాల (540), తేజశ్రీ(553), బి.సాయిరాం (547), ఎస్.భానురేఖ (544), కె.నిఖిత (540), సయ్యద్ ఇబ్రహీం (537), ఎస్.శ్రీలేఖ (530) సత్తా చాటారు. ఈ స్థాయిలో ఫలితాలు సాధించేందుకు తోడ్పడిన అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.

గురుకుల కొలువుల
దరఖాస్తులో సవరణకు అవకాశం

- పోస్టుల వారీగా సవరణకు తేదీలను ప్రకటించిన టీఆర్‌ఈఐఆర్‌బీ
- సవరణకు అవకాశం ఒక్కసారి మాత్రమేనని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల్లో వివరాల సవరణకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) అవకాశం కల్పించింది. ఐదు గురుకుల సొసైటీల పరిధిలో 9 వేలకు పైబడి ఉద్యోగాలకుగాను టీఆర్‌ఈఐఆర్‌బీ గత నెల 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. అయితే అభ్యర్థులు సమర్పించిన ఆన్‌లైన్ దరఖాస్తుల్లో అక్కడక్కడా తప్పులు దొర్లడంతో పాటు వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) సమయంలోనూ పొరపాట్లు జరిగినట్లు టీఆర్‌ఈఐఆర్‌బీకి పెద్ద సంఖ్యలో వినతులు వచ్చాయి. దీంతో దరఖాస్తులో సవరణకు అవకాశం కల్పించింది. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పోస్టు కేటగిరీ వారీగా సవరణ తేదీలను అందులో పేర్కొంది. సగటున ఒక్కో పోస్టుకు సంబంధించిన దరఖాస్తు సవరణకు 5 రోజుల గడువు ఇచ్చింది.

ఎడిట్ అవకాశం ఒక్కసారే...

గురుకుల కొలువుల దరఖాస్తు సవరణకు ఒక్కసారి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు స్పష్టం చేసింది. ఒకసారి సవరణ చేసుకున్న అభ్యర్థికి మరోసారి సవరణకు అవకాశం ఉండదని వివరించింది. ఇప్పటికే ప్రింట్ తీసుకున్న దరఖాస్తు ఫారాన్ని పరిశీలించి పొరపాట్లు ఎక్కడ దొర్లాయో గుర్తించి ఆమేరకు సవరణ చేసుకోవాల్సి ఉంటుంది. సవరణ చేసుకునే అభ్యర్థి ముందుగా గురుకుల బోర్డు వెబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. ఉన్నత విద్యకు సంబంధించిన వివరాలు, సొసైటీ ప్రిఫరెన్సెస్, ఎగ్జామ్ సెంటర్ ప్రిఫరెన్స్ తదితర వివరాల సవరణకు అప్లికేషన్ కరెక్షన్ టాబ్ ద్వారా ఎడిట్ చేసుకోవాలి. అభ్యర్థి బేసిక్ డీటైల్స్, ఇతర వివరాలు, చిరునామా, ఫొటో, సంతకం, తదితరాల సవరణ, అప్‌డేషన్‌కు మాడిఫై వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ దగ్గర క్లిక్ చేయాలి. సవరణ తర్వాత పీడీఎఫ్ దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలి.

పోస్టు కేటగిరీల వారీగా సవరణ తేదీలు

- జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులతో పాటు స్కూళ్లలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) : ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు.
- డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, పాఠశాలల్లో లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, డ్రాయింగ్/ఆర్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్/క్రాఫ్ట్ టీచర్, మ్యూజిక్ టీచర్ : ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు
- ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ): 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు

మీ చిరునవ్వుల్లో సకల సంతోషాలు

ఈ ప్రభుత్వం మీదే.. ఉద్యోగికి మంచి చేయాలన్నదే నా తపన: ఏపీ సీఎం జగన్

కేబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ ఏపీ సీఎంను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుందని, తద్వారా ప్రజలు సంతోషంగా ఉంటారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కొందరు రాజకీయ కారణాలతో చెప్పే అంశాలను ఉద్యోగులు విశ్వసించనక్కరలేదని, నా మనసు ఎప్పుడూ మీకు మంచి చేయడం కోసమే ఉంటుందని, అన్నింటినీ పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో కొత్తగా జీపీఎస్ తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ విలీనం, 12వ పీఆర్సీ ఏర్పాటు సహా ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న పలు నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాయి.



ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఈమేరకు ఏపీ జేఏసీ అమరావతితో సహా పలు ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశమయ్యారు. ''ఉద్యోగులను సంతోషంగా ఉంచేందుకు నా తరపు నుంచి ప్రతి కార్యక్రమాన్ని మనసా, వాచా, కర్మణా చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నా. ఈ విషయాన్ని ఎప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నా..'' అని ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం జగన్ అన్నారు.

మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌కి తెలియజేశామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఉద్యోగ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎం జగన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపామన్నారు. 47 అంశాలపై సీఎస్‌కు తాము లేఖ ఇస్తే 36 అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపామని చెప్పారు. సోషల్ మీడియాలో ఉద్యోగ సంఘాలపై పలువురు వ్యతిరేకంగా పలు రకాల చర్చ నడుపుతున్నారని, ప్రభుత్వానికి ఉద్యోగులను దూరం చేసేందుకే పలు రాజకీయ పార్టీలు ఈ చర్చ నడుపుతున్నాయని తెలిపారు.



ఓబీసీ మహాసంఘ్ మెగా కన్వెన్షన్‌కు ఏపీ సీఎంకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ప్రతినిధులు మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. ఆగస్టు 7న తిరుపతిలోని ఎస్వీ స్టేడియంలో నిర్వహించనున్న 8వ జాతీయ మెగా కన్వెన్షన్‌లో పాల్గొనాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. సీఎం జగన్‌ను కలిసిన వారిలో ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ నాయకులు డాక్టర్ బాబారావు తైవాడే, సచిన్ రాజుర్కర్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, కేశన శంకరరావుతో పాటు మంత్రి జోగి రమేష్ కూడా ఉన్నారు. అనంతరం జస్టిస్ వి.ఈశ్వరయ్య మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించే సభకు ఆహ్వానించగా.. సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో ప్రైవేటు బిల్లుపెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు.

ఎంపీ అవినాశ్ జైలు పాలే మీ లక్ష్యమా?

- సునీతకు సుప్రీంకోర్టు ప్రశ్న
- ఎందుకీ ఈగో క్లాషెస్?
- ప్రతివాది మీ కజినే కదా?
- అంత అత్యవసరం ఏముంది? వెకేషన్ బెంచ్‌కు ఎందుకు?
- ఇప్పుడీ పిటిషన్‌ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బందే
- సీబీఐకి నోటీసులివ్వలేం.. విచారణ 19కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని జైలుపాలు చేయడమే మీ లక్ష్యమా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం నర్రెడ్డి సునీతను ప్రశ్నించింది. ఈ వ్యవహారం చూస్తుంటే ఈగో క్లాషెస్‌లా ఉందని వ్యాఖ్యానించింది. తొందరపడి వ్యక్తిగత వాదనల ద్వారా నష్టపోతారేమో చూసుకోవాలని హితవు పలికింది. పిటిషనర్ సునీత విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తూ అదనపు డాక్యుమెంట్లు అందచేసేందుకు అనుమతించింది. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలంటూ నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. అయితే సుప్రీం వెకేషన్ బెంచ్ సీనియర్ న్యాయవాదులను అనుమతించకపోవడంతో పిటిషనర్ సునీత తన వాదనలు తానే వినిపించడం ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆమెకు సహకరించేందుకు ధర్మాసనం అనుమతించింది. తాను పిటిషనర్‌నని, తన తండ్రి హత్యకు గురయ్యారని సునీత చెబుతుండగా.. ఆ విషయాల్లోకి తాము వెళ్లడం లేదని, వెకేషన్‌లో ఎందుకు వచ్చారని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ కేసులో జూన్ 30 కల్లా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఛార్జిషీట్ ముందే ఫైల్ చేయాల్సి ఉంది. ఏ – 8 (అవినాశ్) భారీ కుట్ర చేసిన ప్రధాన వ్యక్తుల్లో ఒకరు. సీబీఐ దర్యాప్తునకు సహకరించడంలేదు. ముందస్తు బెయిలు పొందడం వల్ల కస్టోడియల్ ఇంటరాగేషన్ కుదరడం లేదు. ముందస్తు బెయిలు ఎందుకు ఇచ్చారో కారణాలు తెలియడం లేదు'' అని సునీత పేర్కొన్నారు. ఈ సమయంలో జస్టిస్ విక్రమ్‌నాథ్ జోక్యం చేసుకుంటూ 'దీంట్లో అంతగా అత్యవసరమైన పరిస్థితి ఏముంది? వెకేషన్ బెంచ్‌కు రావాల్సిన అవసరం ఉందా?' అని ప్రశ్నించారు.

సీబీఐ చూసుకుంటుంది..

'ఒక వ్యక్తిని అరెస్టు చేయాలో లేదో దర్యాప్తు సంస్థ చూసుకుంటుంది. ఎవరిని, ఎప్పుడు అరెస్టు చేయాలో ఎవరిని కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాలో సీబీఐకు తెలుసు. విచారణకు సహకరిస్తున్నారా లేదా అనేది కూడా సీబీఐ చూసుకుంటుంది. మీరెందుకు జోక్యం చేసుకుంటారు? ఈ కేసులో పలు సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయి. మీకెందుకు ఈగో క్లాషెస్? అతడిని (ఎంపీ అవినాశ్) జైలుపాలు చేయాలన్న లక్ష్యమా? ఆవిధంగా చూడొద్దు. ఈ తరహా ప్రొసీడింగ్స్ ఎందుకు?'' అని జస్టిస్ అమానుల్లా వ్యాఖ్యానించారు.



ఇప్పుడీ పిటిషన్‌ను కొట్టివేస్తే..

ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇతర నిందితులతో కలసి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత ఆరోపించారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అవినాశ్‌రెడ్డి సీబీఐ దర్యాప్తునకు సహకరిస్తున్నప్పుడు కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం ఏముందని ప్రశ్నించింది. ''మీకో సలహా ఇస్తాం. మీరు వ్యక్తిగతంగా వాదిస్తున్నారు. చట్టంపై అవగాహన లేమితో వాదనలో అంతగా ప్రావీణ్యం లేకపోవచ్చు. మేం ఇప్పుడు ఈ పిటిషన్‌ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బంది అవుతుంది. అందుకే సెలవుల తర్వాత విచారణ జాబితాలోకి చేరుస్తాం'' అని సునీతనుద్దేశించి ధర్మాసనం పేర్కొంది. సీబీఐ దర్యాప్తు ఈ నెల 30 కల్లా పూర్తి కావాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఈ సమయంలో పేర్కొన్నారు. వాదనలకు సీనియర్ న్యాయవాదులను అనుమతించడం లేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ తమకు ఇబ్బంది కలగ చేయవద్దని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. తాము ఇప్పుడు వాదనలకు అనుమతిస్తే మరో నలుగురు సీనియర్ న్యాయవాదులు తమను వివక్షకు గురి చేశారని ఆరోపించే అవకాశం ఉందని పేర్కొంది. తాము అనుమతించకపోయినప్పటికీ మీరు వాదనలు చేస్తున్నారంటూ లూథ్రాను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో మరో బెంచ్ నిర్దేశించిన డెడ్‌లైన్‌ను తాము మార్చలేమని స్పష్టం చేసింది.

గడువు నిర్దేశించాక ఎలా మారుస్తాం?

సీబీఐకు నోటీసులిచ్చి విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించాలని ధర్మాసనాన్ని సునీత కోరారు. అయితే ఇప్పటికే మరో బెంచ్ జూన్ 30వ తేదీ అని గడువు నిర్దేశించిన తరువాత తాము ఎలా మారుస్తామని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవేళ ఇప్పుడు తాము జోక్యం చేసుకుంటే మొత్తం అంతా మారిపోతుందని వ్యాఖ్యానించింది. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వాలని సునీత మరోసారి అభ్యర్థించడంతో ధర్మాసనం స్పందిస్తూ.. ''ఎందుకు సీబీఐ రావాలని కోరుతున్నారు? రావాలో వద్దో సీబీఐ నిర్ణయించుకుంటుంది. ప్రతివాది సహకరించకుంటే, కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమైతే, హైకోర్టు ఆదేశాలు సరికాకుంటే సీబీఐ తనకు తానే వస్తుంది. అందుకే చెబుతున్నాం. జూలై 3న కోర్టుకు రండి. మీ న్యాయవాది వాదిస్తారు' అని ధర్మాసనం సూచించింది.

న్యాయవాది వాదించడమే సబబు..

హైకోర్టు ఆదేశాలు నిష్ప్రయోజనమని ఈ అంశానికి సంబంధించి మరో కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సునీత పేర్కొనడంతో అందుకే తాము సెలవుల తర్వాత రావాలని సలహా ఇస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ప్రతివాది అవినాశ్ మీ కజినా? అని ధర్మాసనం పదేపదే సునీతను ప్రశ్నించగా... అవునని తన రెండో కజిన్ అని సునీత సమాధానమిచ్చారు. అయితే పిటిషనర్ తరఫున న్యాయవాది వాదించడమే సబబని, ఇందులో సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా సునీత పిటిషన్‌ను బుధవారం విచారణ జాబితాలో చేర్చాలని, అడ్వొకేట్ ఆన్‌రికార్డ్స్ హాజరవుతారని లూథ్రా న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వడంలో తాము జోక్యం చేసుకోబోమని, పిటిషనర్ విజ్ఞప్తి మేరకు ఈ నెల 19న విచారణ జాబితాలో చేర్చాలంటూ రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

అక్షరాస్యత శాతం పెంపునకు కృషి



కందనూలు: పట్టంలోని జవహర్ నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో జీ20పై మంగళవారం మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడ మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. నవోదయ ప్రిన్సిపల్ భాస్కర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు హాజరుకాగా.. జోతిబా పూలే పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ విఘ్నేశ్వరి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రావు మాట్లాడుతూ జీ20 ప్రపంచ దేశాల సమాఖ్యకు భారత్ అధ్యక్షత వహించి మార్గనిర్దేశం చేయడం గర్వకారణమన్నారు. ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ జీ20 ప్రాధాన్యత, లక్ష్యాలు, మన దేశ పాత్రను క్షుణ్ణంగా వివరిస్తూ, ఆదర్శవంతమైన ప్రపంచ రూపకల్పన, ప్రపంచ దేశాల ఆర్థిక విద్యా వ్యవస్థలను వృద్ధి చేయడం, వివిధ దేశాల పరస్పర సహకారం, విశ్వాంతి అంతర్జాతీయ అవగాహన తదితర వాటి కోసం మన దేశం కృషి చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అలాగే 2020 జాతీయ విద్యా విధానం, జాతీయ ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ) మిషన్ కింద అన్ని స్థాయిల్లో అక్షరాస్యత శాతం పెంపొందించి సర్వతో ముఖాభివృద్ధి సాధించేలా ముందుకు సాగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రైలు పట్టాలపై వ్యక్తిని కాపాడిన పోలీసులు

రాజాపూర్: ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపై పడుకున్న ఓ వ్యక్తిని పోలీసులు కాపాడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వారి కథనం మేరకు...మల్లేపల్లికి చెందిన రాఘవాచారి తన భార్యతో గొడవ కారణంగా ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో అతడి భార్య వరలక్ష్మి తన భర్తను కాపాడాలంటూ 100కు ఫోన్ చేయగా రాజాపూర్ బ్లూకోల్ట్‌స్టాఫ్ అంజయ్యతో పాటు కానిస్టేబుల్ శంకర్ వెంటనే సమాచారం అందుకుని స్పందించారు. అప్పటికే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై పడుకున్న రాఘవాచారిని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత అతడి భార్యకు సమాచారం అందించారు.

భూగర్భ జలాలు బాగా పెరిగాయి..

- కరువు ఛాయలు కనిపించే జిల్లా చాలా మారింది
- కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి పొసామీబసు



అధికారులతో నోడల్ అధికారి పొసామీబసు, కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పెరిగిన భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత రైతులు, ప్రజలపై ఉందని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి, ఐఏఎస్ అధికారి పొసామీ బసు అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆమె జిల్లాలోని పలుప్రాంతాల్లో భూగర్భజలాల సంరక్షణ, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు జిల్లావ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ సీతారామారావు, సంబంధిత జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో కరువు ఛాయలు ఎక్కువగా ఉండేవని, అలాంటిది ఇప్పుడు జిల్లాలో చాలా మార్పు వచ్చిందన్నారు. పచ్చదనం పెరిగిందని, వ్యవసాయం, ఉద్యానం, మౌలిక సదుపాయాలు పెరిగాయని చెప్పారు. ఎం ఆర్ ఎం కింద చేపట్టిన కాందకాల తవ్వకం, ఫీడర్ ఛానళ్లు, ఊట కుంటలు, కాంటూర్ కందకాలు, చెరువుల పూడికతీత వంటివి పెంచడం వల్ల భూగర్భజలాలు బాగా పెరిగినట్లు గుర్తించామని తెలిపారు. భూగర్భజలాలను దుర్వినియోగం కాకుండా సక్రమంగా వినియోగించుకోవాలని, ఇందుకు రైతులు పంటల విధానాన్ని మార్చి, ఆయిల్‌ఫాం, ఆరుతడి పంటల సాగు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ శాఖ ద్వారా అడవులలో నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పొలాల్లో వాననీటి కుంటలు, ఫిష్ పాండ్స్, అమృత్ సరోవర్ కింద మరిన్ని చర్యలను చేపడితే బాగుంటుందని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు ప్రదీప్ కుమార్, మహమూద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించడం లేదు'



మాట్లాడుతున్న నిరంజన్, నాగం జనార్దన్‌రెడ్డి తదితరులు

- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

కల్వకుర్తి: దేశంలోని నాలుగు రాష్ట్రాల ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ అన్ని చర్యలు చేపట్టిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. మే 20 నుంచి జూన్ 23 వరకు క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారులు ఓటర్ లిస్టు ఆధారంగా పరిశీలన చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో పాటు ప్రతివారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం అవ్వాలనే నిబంధనలు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలో బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో ఓటర్ లిస్టు ఆధారంగా పరిశీలన చేయకపోవడం విస్తు గొలిపే అంశం అన్నారు. ఇది ఎన్నికల కమీషన్ ఆదేశాలను దిక్కరించడమే అని నిరంజన్ అన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రతి వారం ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేసే సమావేశం తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారన్నారు. జూన్ 12 నుంచి ఈవీఎంలతో, వీవీప్యాట్‌లను మొదటిసారి పరిశీలించాలనే ఆదేశాలు ఉన్నాయని, హైదరాబాద్‌లో ఈ ప్రక్రియ ఆరా తీస్తున్నట్లు తమ పార్టీ కార్యాలయానికి సమాచారం వచ్చిందన్నారు. సిరిసిల్ల జిల్లాలో సమావేశం ఉదయం 9గంటలకు ఉంటే మధ్యాహ్నం 3గంటలకు సమాచారం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. జిల్లా ఎన్నికల ఇన్చార్జ్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్లు ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా పార్టీలకు చెప్పకుండా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. పార్టీ నాయకులు ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. అక్టోబర్ 4వ తేదీన ఓటరు తుదిజాబితాను రూపొందిస్తారని ఆ జాబితా ప్రకారమే ఎన్నికల నిర్వహణ ఉంటుందని నిరంజన్ తెలిపారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు 20లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని సీఎం గద్వాలలో చెప్పారని ఇది పచ్చి అబద్ధం అన్నారు. 20లక్షల ఎకరాలకు ఎక్కడ సాగునీరు అందిస్తున్నారో నిరూపించాలని నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీకృష్ణ, బడెంపేట్ మున్సిపల్‌చైర్మన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పారిజాతరెడ్డి, ఆలేరు ఇన్చార్జ్ కల్వకుర్తి పరిశీలకుడు ఐలయ్య, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్చార్జ్ మధుసూదన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, సుహాసన్ రెడ్డి, బాలగౌడ్, శేఖర్, పాండుగౌడ్, పలువురు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

జడ్చర్ల: రైతులు వానాకాలం సీజన్‌లో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు భరత్ భూషన్, రాజమణి అన్నారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో రైతులకు ఏర్పాటు చేసిన వానాకాలం పంటల సాగుకు సన్నద్ధత కార్యక్రమంలో వారు పాల్గొని పలు సూచనలు చేశారు. వానాకాలంలో పత్తి,ఆముదాలు,జొన్నలు,కంది తదితర ఆరుపతడి పంటలు సాగు చేసే విధంగా ఆలోచించాలని అన్నారు. వరి పంటలో తక్కువ కాలంలో దిగుబడులు వచ్చే ఆర్ఎన్ఆర్ –15048, కేఎన్ఎం –1638 వంటి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. భూసారం పెరిగేందుకు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను సాగు చేసుకోవాలన్నారు. వీటి ద్వారా భూసారం పెరగడంతో పాటు పంటల దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకుని వాటిని భద్రపర్చుకోవాలన్నారు. పంటల సాగుకు సంబంధించి క్షేత్రస్థాయి వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయాధికారి గోపీనాథ్, ఏఈఓ నర్సిములు పాల్గొన్నారు.



ఉన్నత చదువుతోనే అత్యున్నత స్థాయికి..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో నల్లమల చెంచులు

- నల్లమల చెంచులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మన్ననూర్: ఉన్నత చదువులు చదువుకుంటేనే జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాష్ట్రపతి పిలుపు మేరకు సోమవారం నల్లమల చెంచులు దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణతోపాటు మరో 9 రాష్ట్రాల నుంచి ఢిల్లీకి తరలివెళ్లిన పీవీటీలతో (చెంచు గిరిజనులు) అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు రెండు గంటలపాటు ముఖాముఖిగా చర్చించారు. ఇందులో భాగంగా చెంచుల స్థితిగతులు తెలుసుకున్న ఆమె పలు సూచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచుల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్నివర్గాలతో సమానంగా అభివృద్ధి చెందాలంటే ఉన్నతమైన చదువుల్లో రాణించాలన్నారు. ఆదిమ జాతికి చెందిన నేను దేశంలోనే అత్యున్నత స్థానానికి చేరుకోవడానికి చదువే కారణం అన్నారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా రూ.1,500 కోట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే కొనసాగుతున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్రపతితో కలిసి వీక్షించామని ఆదివాసీలు ఆనందం వ్యక్తం చేశారు. సహపంక్తి భోజనాల అనంతరం రాష్ట్రపతి చేతులమీదుగా చెంచు మహిళలకు చీరె సారెలు, పురుషులను శాలువాలతో సన్మానించారు. అంతకు ముందు మొదటి సెషన్‌లో భాగంగా సంబంధిత అధికారులతో కలిసి ఢిల్లీల్లోని పార్లమెంట్, ఇండియా గేట్, అక్షరధామం, లాంగ్ గార్డెన్ తదితర ప్రదేశాలను తిలకించారు. కార్యక్రమంలో మన్ననూర్ ఐటీడీఏ తరుపున ఏఓ జాఫర్ హుస్సేన్, చెంచులు పోతమ్మ, పుష్పమ్మ, అక్కమ్మ, లింగస్వామి, నాగన్న, లింగయ్య, శాంతి, భౌరమ్మ, నారాయణ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి అధికారుల స్వాగతం

మన్ననూర్: రాజస్థాన్ రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీవాస్తవ్‌కు మన్ననూర్‌లోని మృగవాణి రెస్టారెంట్ ప్రాంగణంలో ప్రభుత్వ అధికారులు స్వాగతం పలికారు. మంగళవారం శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఆయన వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు గౌరవ వందనం తెలుపడంతో పాటు అధికారులు శాలువా, పూలబొకేతో సన్మానించారు. ఇక్కడి నల్లమల పరిసర ప్రాంత వాతావరణం ఆహ్లాదకరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆరీష్, ఎస్సై వీరబాబు, ఆర్ఐ వెంకటేష్ ఉన్నారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రాజస్థాన్ హైకోర్టు జడ్జి శ్రీవాస్తవ్

20వేల లీటర్ల డీజిల్ ట్యాంకర్ సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పౌరసరఫరాల అధికారులు చేసిన తనిఖీల్లో కర్ణాటక నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న డీజిల్ ట్యాంకర్‌ను సీజ్ చేశారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో పాలమూరు యూనివర్సిటీ దగ్గర జిల్లా పౌరసరఫరాల అధికారులు చేసిన తనిఖీల్లో ఏపీ 29 డబ్ల్యూ 0150 నంబర్ కలిగిన ట్యాంకర్ 20వేల లీటర్ల డీజిల్‌తో హైదరాబాద్ వెళ్తూ పట్టుబడిందని తెలిపారు. డీజిల్ తరలించడానికి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్యాంకర్‌ను సీజ్ చేసి కైలాస్ పెట్రోల్ బంక్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. కర్ణాటకలో తక్కువ ధరకు డీజిల్ తీసుకొచ్చి తెలంగాణలో అధిక ధరకు విక్రయిస్తున్నారని జిల్లా పౌరసరఫరాల అధికారి బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీజిల్ ట్యాంకర్ సరఫరా చేస్తున్న లోకేష్‌తో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.